సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం : 7 : సెప్టెంబర్ : 2025



దళితులపై దాడులు దారుణం

కైకలూరు మండలం దానగూడెంలో దళితులపై జరిగిన దాడులను వివిధ సంఘాలు, పలు పార్టీల నాయకులు ఖండించారు.
8లో ▸



వీసీ నియామకానికి ముగ్గురి పేర్లు

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ నియామకం కోసం ముగ్గురు సీనియర్ల పేర్లను రిజిస్ట్రార్ ప్రభుత్వానికి పంపారు.
8లో ▸



మేం బానిసలం కాదు..

మేం బానిసలం కాదు.. ప్రభుత్వ ఉద్యోగులమంటూ సచివాలయ ఉద్యోగులు పోరుబాట పట్టారు. నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.
8లో ▸

ఎనీవేర్‌కు కేరాఫ్ ఉండి

కాళ్ల మండలం కలవపూడిలో దాదాపు రూ.2.50 కోట్ల విలువైన 1.68 ఎకరాల గ్రామ కంఠం భూమిని జూన్ 30న ఒక సబ్ రిజిస్ట్రార్ తన భర్త పేరిట రిజిస్ట్రేషన్ చేసేశారు. ఈ విషయమై ఫిర్యాదు అందడంతో జూలై 15న రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఈ విషయమై విచారణ కొనసాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

కృష్ణా జిల్లా చినగొల్లపాలెంకు చెందిన ఏలూరి రంగబాబు కుటుంబానికి చినగొల్లపాలెంలో 32 ఎకరాల సాగు భూమి ఉంది. కొందరు ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించి ఈ భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు రంగబాబు ఆందోళనకు దిగారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అందుకు కొమ్ముకాస్తున్నారంటూ టెంట్ వేసి నిరసన తెలిపారు.

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలు దండి
- ఒకరి భూమి మరొకరి పేరుపై ఉండిలో రిజిస్ట్రేషన్
- రెండు నెలలుగా సెలవులోనే సబ్ రిజిస్ట్రార్
- గ్రామ కంఠం భూమిని రిజిస్టర్ చేసేసిన మరో సబ్ రిజిస్ట్రార్
- రిజిస్ట్రేషన్ల కోసం పొరుగు జిల్లాల నుంచి జనం క్యూ
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, భీమవరం/ ఉండి: పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు లోపభూయిష్టంగా జరుగుతున్నాయా? అమరావతి, చుట్టుపక్కల జిల్లాల వారు రిజిస్ట్రేషన్ల కోసం ఇక్కడికి క్యూ కడుతున్నారా?.. అంటే అవుననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడకుండా భూములు, స్థలాలను ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ప్రభుత్వం 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' వీలు కల్పించింది. సాధారణంగా నిషేధిత జాబితాలోని భూములు, స్థలాలపై స్థానిక సబ్ రిజిస్ట్రార్లకు అవగాహన ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు, వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించి అన్నీ సవ్యంగా ఉన్నాయనుకుంటేనే రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. బయటి ప్రాంతాల్లోని వారికి ఈ భూములపై అవగాహన ఉండదు. బయటి ప్రాంతాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఏరియాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అన్నీ ధ్రువీకరించుకున్న తర్వాతనే రిజిస్ట్రేషన్లు చేయాలి. అయితే ఎనీవేర్ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు అక్రమాలకు తెరలేపుతున్నారు. గతంలో మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయటి ప్రాంతాలకు చెందిన నిషేధిత జాబితాలోని భూముల రిజిస్ట్రేషన్ చేశారన్న విషయంలో సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకున్నారు. అయినా కొందరి తీరులో మార్పు రావడం లేదు.

వందలాది ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు

ప్రస్తుతం ఉండి, ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ తరహా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల్లో ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1,013 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు చేయగా వీటిలో 300లకు పైగా ఇతర జిల్లాలకు చెందిన వారివే ఉన్నాయి. ఆకివీడులో వెయ్యికి పైనే రిజిస్ట్రేషన్లు జరగ్గా అక్కడ కూడా ఇదే పరిస్థితి ఉన్నట్టు సమాచారం. కృష్ణా జిల్లా బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, మండవల్లి, ఉయ్యూరు, ఏలూరు జిల్లా కైకలూరు, ప్రకాశం జిల్లా కనిగిరి, పల్నాడు జిల్లా గురజాల, గుంటూరు జిల్లా పెదకాకాని, జంగారెడ్డిగూడెం, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన వారి రిజిస్ట్రేషన్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఎనివేర్ రిజిస్ట్రేషన్లకు సంబంధించి పూర్తి సమాచారం ఇచ్చేందుకు ఉన్నతాధికారుల అనుమతులు కావాలంటూ అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. మంగళ, శుక్రవారాలు, అమావాస్య రోజుల్లోనూ బయట జిల్లాల వారితో ఆయా కార్యాలయాలు కళకళలాడుతుంటాయని తెలిసింది. ఆయా కార్యాలయాల వద్ద లేఖర్లదే ఇష్టారాజ్యమంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పాతుకుపోయిన కొందరు అన్నీ తామై వ్యవహరిస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి.

గణపవరానికి చెందిన కురెళ్ల రాజ్‌కుమార్‌కు ఏలూరు జిల్లా కలిదిండి మండలం పటమటిపాలెంలోని 9 సెంట్ల భూమి ఉంది. ఏప్రిల్ 24న ఉండి సబ్ రిజిస్ట్రార్ ఈ భూమిని అదే గ్రామానికి చెందిన మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేశారు. విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సవరణ పేరుతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసినట్టుగా విచారణలో నిర్ధారణ అయ్యింది. సబ్ రిజిస్ట్రార్ దాదాపు రెండు నెలలుగా సెలవులో ఉన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ బాధితుడు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఇప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. కాగా సమస్యను పరిష్కరించి ఉండి ఎస్సై చేతుల మీదుగా రాజ్‌కుమార్‌కు ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్టు నాలుగు రోజుల క్రితం పీజీఆర్ఎస్ సైట్‌లో అధికారులు ఫేక్ ఫొటోను అప్‌లోడ్ చేశారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

ఫేక్ ఫొటోతో అర్జీ క్లోజ్



నా భూమిని నాకు స్వాధీనం చేయకపోవడంతో పాటు వేరే వారి పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, లేఖర్లపైనా చర్యలు తీసుకోవాలి. ఉన్నతాధికారులను అడుగుతుంటే సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారని చెబుతున్నారు. ఈ విషయమై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా నాకు న్యాయం జరగలేదు. సమస్యను పరిష్కరించినట్టుగా ఫేక్ ఫొటో అప్‌లోడ్ చేసి నా అర్జీని క్లోజ్ చేశారు.

– కురెళ్ల రాజ్‌కుమార్, గణపవరం

న్యూస్‌రీల్

ఇసుక మాఫియాపై ఫిర్యాదు



శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుగొండ: ఆచంటలో ఇసుక మాఫియా అక్రమ దందాపై శాసనమండలిలో చర్చించి పేదలకు ఉచితంగా ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు వైఎస్సార్ సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం భీమవరంలో వినతిపత్రం అందించారు. నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, చింతపల్లి గురుప్రసాద్, కర్రి వేణుబాబు మాట్లాడుతూ టీడీపీ నాయకుడు రాంబాబు, ముఖ్య నాయకులు అక్రమ దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పలు గ్రామాల్లో ఇసుక గుట్టలు ఏర్పాటు చేసి అధిక ధరలకు అమ్ముతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. గుబ్బల రామకృష్ణ, దొంగ దుర్గా ప్రసాద్, కుడిపూడి సుబ్రహ్మణ్యం, వీరవల్లి కృష్ణ ఉన్నారు.

ఆక్వాకల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డి



తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ఆక్వాకల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పడా మాజీ వైస్ చైర్మన్, రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంను శనివారం నియమించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో తెలిపింది. గత ప్రభుత్వంలో అప్పడా వైస్‌చైర్మన్‌గా నిరంతరం రైతుల వెంట ఉన్న వడ్డి రఘురాం ఈ రంగానికి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఆక్వా రంగంలో విశేష సేవలందించడానికి వీలుగా తనకు ఈ పదవిని ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి రఘురాం ధన్యవాదాలు తెలిపారు. ఆయన నమ్మకానికి తగ్గట్టుగా రైతులకు సేవలు అందిస్తానన్నారు.

'విద్యాశక్తి' బహిష్కరణ

భీమవరం: జిల్లాలో విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పెన్మెత్స విజయరామరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ జి.ప్రకారం, పీఆర్‌వీఎస్ సాయివర్మ తెలిపారు. డీఈఓ కార్యాలయంలో శనివారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాశక్తి కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా నిర్వహించాలన్న విధివిధానాలుంటే నిర్బంధంగా అమలు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు సాయంత్రం అదనపు తరగతులు కేటాయించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు భారంగా ఉన్నందున అదనంగా 6 నుంచి 9వ తరగతి వరకు విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని ఫ్యాప్టో బహిష్కరిస్తోందన్నారు.

కొనసాగని పంటు రాకపోకలు

నరసాపురం: నరసాపురం-సఖినేటిపల్లి రేవులో గోదావరి ప్రవాహ ఉధృతి కారణంగా పంటు రాకపోకలను పునరుద్ధరించలేదు. మరోవైపు చించినాడ బ్రిడ్జిపై నుంచి బస్సులు తిరగకపోవడంతో ఉభయగోదావరి జిల్లాల మధ్య ప్రయాణం ప్రయాసగా మారింది. ఇదిలా ఉండగా నరసాపురంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతోందని, ఆది, సోమవారాల్లో పంటు రాకపోకలు పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

భీమవరం: ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్ వద్ద ఏపీఎస్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల సూచనలు పాటించాలన్నారు. అనంతరం ఎస్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులు వరదలు, గాయాలు తగిలినప్పుడు, అపస్మారక పరిస్థితులు, గ్యాస్ లీకేజీల వంటి ప్రమాదాల సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, డీఈఓ ఈ.నారాయణ పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): కౌశలం సర్వే, పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్, ఈపీటీఎస్ ఫైల్ అప్‌లోడింగ్ ప్రక్రియను వేగిరపర్చాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో సమీక్షించారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు

స్వయం సహాయక సంఘాల మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి అన్నారు.

భీమవరంలో రఘురామ పెత్తనమేంటి?

వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భీమవరం: భీమవరం మున్సిపాలిటీ మంచినీటిని విస్సాకోడేరు పంచాయతీలోని నాన్ లేఅవుట్‌కు తరలించడంపై ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్పందించకుండా ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడటం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు దుయ్యబట్టారు. శనివారం రాయలంలో వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ భీమవరంలోని శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఎమ్మెల్యే అంజిబాబు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అయినా ఉండి నియోజవకర్గంలోని విస్సాకోడేరు పరిధిలోని నాన్ లే అవుట్‌కు ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయడాన్ని తాము ప్రశ్నిస్తే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తనపై వ్యక్తిగత దూషణలతో మాట్లాడటం బాధాకరమన్నారు. రఘురామకు రాజకీయాలు తెలియని రోజుల నుంచి తాను ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నానని, విద్యార్థి సంఘ నాయకుడిగా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా సమస్యలపై పోరాడానన్నారు.

వ్యక్తిగత దూషణ సరికాదు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతో ఎదిగిన డిప్యూటీ స్పీకర్ ఆ పార్టీని కించపర్చేలా, బీసీ నాయకుడు నాగేశ్వరరావును వ్యక్తిగతంగా దూషించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి రూల్స్ ఒప్పుకోవని చెబుతున్న డిప్యూటీ స్పీకర్ మున్సిపాలిటీ తాగునీటిని గ్రామ పంచాయతీకి ఇవ్వడానికి రూల్స్ ఎలా ఒప్పుకుంటాయో చెప్పాలన్నారు. వెంకటరాయుడు మాట్లాడుతూ గతంలో రాయలం గ్రామానికి మున్సిపల్ నీరు ఇవ్వాలని కోరితే అభ్యంతరం చెప్పిన అధికారులు ఇప్పుడు విస్సాకోడేరు పంచాయతీకి పైప్‌లైన్ ఎలా వేశారని ప్రశ్నించారు. భీమవరం నియోజకవర్గంపై ఉండి ఎమ్మెల్యే పెత్తనం ఏంటని నిలదీశారు. పార్టీ నాయకులు ఏఎస్ రాజు, చవాకుల సత్యనారాయణ, గాదిరాజు రామరాజు, చిగురుపాటి సందీప్, పాలవెల్లి మంగ, మానుకొండ ప్రదీప్ పాల్గొన్నారు.

9న వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు

- రైతులపై ప్రభుత్వానికి చిన్నచూపు
- యూరియా సరఫరాలో విఫలం
- రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఉద్యమం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



పెదఅమిరంలో అన్నదాత పోరు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాళ్ల: రాష్ట్రంలో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు పాలన నడుస్తోందని, రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టిందని, ఈనెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద అన్నదాత పోరు కార్యక్రమం ద్వారా నిరసన తెలియజేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్నదాతలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. రైతుల సంక్షేమానికి దివంగత వైఎస్సార్, ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీకే రుణాలు, సబ్సిడీపై పురుగు మందులు, ఎరువులు అందించామని గుర్తు చేశారు. ఉచిత బీమాతో రైతులను ఆదుకున్నామన్నారు. రాష్ట్రంలో 10,500 రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తే కూటమి ప్రభుత్వం వాటికి తాళాలు వేసిందని మండిపడ్డారు.

బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు

ప్రస్తుత కూటమి పాలనలో విత్తనాలు, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని ప్రసాదరాజు ఆరోపించారు. అయినా ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి స్పందించకపోగా రైతులను అవమానించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా బస్తా దొరకని పరిస్థితి నెలకొందని, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. రైతులు బ్లాక్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోయారు. ఆక్వా రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారిందని, వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. రైతుల పక్షాన ఈనెల 9న భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలోని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నదాత పోరు కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఉండి, భీమవరం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీవీఎల్ నరసింహరాజు, చినమిల్లి వెంకటరాయుడు, నరసాపురం పార్లమెంటరీ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, కామన నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మోసపూరిత హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని దాటవేయడం చంద్రబాబు నైజమని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. శనివారం పడమరవిప్పర్రులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఆయన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ మోసం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను వంచించారన్నారు. కూటమి నాయకులు ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా ఆలోచించాలన్నారు. చంద్రబాబు ఏం చెబితే దానికి తల ఊపడం సరికాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారన్నారు. ప్రతి కార్యకర్త కూటమి వైఫల్యాలను ఇంటింటా వివరించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడి మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. మద్యం మాఫియా సిండికేట్‌గా ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారన్నారు. ముందుగా పత్సా అంజిబాబు నివాసం వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు జడ్డు హరిబాబు, వెలిచేటి నరేంద్ర, బండారు నాగు, ములకాల రాంబాబు, పత్సా అంజిబాబు, ములకాల ప్రసాద్, ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

● గుంతల్లో పడి మొరాయించిన అంబులెన్స్

తమ ప్రభుత్వ హయాంలో రోడ్లు వేయకపోయినా, గోతుల్లేని రహదారులుగా తీర్చిదిద్దుతామంటూ వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఆచరణలో ఆ ఊసే మరిచింది. పశ్చిమగోదావరి జిల్లాలోని రహదారులు గుంతలమయంగా మారి నరకానికి నకళ్లుగా మారుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తోంది. శనివారం వీరవాసరం-నవుడూరు రహదారిపై బుదారాయుడు చెరువు గ్రామం వద్ద గుంతల్లో పడి 108 అంబులెన్సు ప్రమాదానికి గురైంది.

-వీరవాసరం



మమ అనిపించారు



ఉండి: ఉండి బస్టాండ్‌లో రోడ్ల దుస్థితిపై 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం బస్టాండ్ ప్రాంగణంలో రోడ్లపై గోతులను కంకరతో పూడ్చించి నామమాత్రంగా పనులు చేయించారు. అయితే మెత్తటి కంకరతో రోడ్లు పూడ్చించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవని పలువురు అంటున్నారు. వర్షం వస్తే బస్టాండ్‌లోనికి వెళ్లేందుకు గతంలో కొద్దోగొప్పో అవకాశం ఉండేదని, ఇప్పుడు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అట్రాసిటీ కేసు పెట్టాలి

ఉండి: చెరుకువాడలో దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి, దళితులకు రక్షణ కల్పించాలని దళిత ఐక్యవేదిక రాష్ట్రాధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం చెరుకువాడలో దళితులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పీజీటీ సస్పెన్షన్

భీమవరం (ప్రకాశంచౌక్)/తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ పీజీటీ భీమడోలు రాజారావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలకు చెందిన బ్యాక్ పైపర్ బ్యాండ్ విద్యార్థుల బృందాన్ని అనుమతి లేకుండా నరసాపురంలోని ఓ ప్రైవేటు కళాశాల కార్యక్రమానికి పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా కో-ఆర్డినేటర్ ఉమాకుమారికి షోకాజ్ నోటీసు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

శ్మశానంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రాణాపాయం



ఉండి విద్యుత్ కార్యాలయం వద్ద బైఠాయించిన దళిత మహిళలు

ఉండి: పాములపర్రు దళితుల శ్మశాన వాటికలో అక్రమంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలంటూ పాములపర్రు గ్రామానికి చెందిన దళిత మహిళలు ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఏఈ కార్యాలయాన్ని ముట్టడించారు. గత నెల 22న విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ కనెక్షన్ తొలగించిన అధికారులు తిరిగి ఈనెల 4న విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించడంపై శనివారం మండిపడ్డారు. సదరు రైతుకు నోటీసు పంపిస్తామని, ఇందుకు వారం రోజులు సమయం కావాలని ఏఈ పి.శ్రీనివాసరావు తెలపగా మహిళలు ససేమిరా అన్నారు. మహిళలు కార్యాలయం ఎదుటే బైఠాయించి, అక్కడే భోజనాలు చేసి నిరసన తెలిపారు. విషయం తెలిసిన ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు ఇక్కడకు చేరకుని మహిళలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అయినా మహిళలు పట్టువీడలేదు. పోలీసులు, విద్యుత్ అధికారులు, మహిళలకు మధ్య జరిగిన చర్చలు ఫలించకపోవడంతో నిరసన కార్యక్రమం శనివారం రాత్రి వరకు కొనసాగింది. గతంలో తాము ఫిర్యాదు చేయగా విద్యుత్ సరఫరా కట్ చేశారని, మరలా కూటమి నాయకుల ఒత్తిళ్లతో కనెక్షన్‌ను పునరుద్ధరించారని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల శ్మశాన వాటికలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందన్నారు. దీనిపై ఏఈ పి.శ్రీనివాసరావును వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ విషయమై సదరు రైతుకు నోటీసులు ఇస్తామని, పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు. దళిత మహిళలు దర్శి మెర్సీ, ఆంద్రు సునీత, బడుగు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ పెత్తనాన్ని తిప్పికొట్టాలి

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన



ప్రకాశం చౌక్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై చేస్తున్న పెత్తనాన్ని తిప్పికొట్టాలని, భారత్‌పై సుంకాల పేరుతో సాగిస్తున్న కక్ష సాధింపులను విరమించుకోవాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు కోనాల భీమారావు, జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. భారత దిగుమతులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించడాన్ని నిరసిస్తూ స్థానిక ప్రకాశం చౌక్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. సుంకాలను రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వం అమెరికాపై ఒత్తిడి తేవాలన్నారు. అమెరికా సుంకాలతో ఆక్వా, ఫార్మా, ఆటోమొబైల్ ఇలా పలు రంగాలు కుదేలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడానికి కూటమి ప్రభుత్వం కూడా ఏ మాత్రం నిరసన వ్యక్తం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ఎంసీపీయూ నాయకుడు జి.రాంబాబు, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.16.63 లక్షలకు లడ్డూ వేలం



వేలంలో లడ్డూను దక్కించుకున్న మాధవరావు

నూజివీడు: మండలంలోని మిట్టగూడెం వినాయక చవితి నవరాత్రుల్లో విఘ్నేశ్వరుడికి ప్రసాదంగా ఏర్పాటుచేసిన 11 కేజీల లడ్డూకు శనివారం వేలం నిర్వహించగా రూ.16.63 లక్షలకు మాజీ ఎంపీటీసీ కొనకళ్ల మాధవరావు దక్కించుకున్నారు. గతేడాది సైతం లడ్డూను వేలంలో రూ.9.09 లక్షలకు మాధవరావు సొంతం చేసుకున్నారు. సర్పంచ్ కొనకాల నరసింహారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12 వేల కిలోల గోమాంసం పట్టివేత

బుట్టాయగూడెం: కలకత్తా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఒక కంటైనర్‌ను జీలుగుమిల్లి పోలీసులు శనివారం తనిఖీ చేసి అందులో సుమారు 12,100 కేజీల గోమాంసాన్ని పట్టుకున్నారు. గ్రామశివారులోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కంటైనర్‌లో ఏదో తరలిస్తున్నట్లు అనుమానంతో తనిఖీ చేయగా గోమాంసాన్ని గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మాంసాన్ని నిర్జీవ ప్రదేశంలో ఖననం చేశారు.

బానిసలం కాదు.. ప్రభుత్వ ఉద్యోగులం

- సచివాలయ ఉద్యోగుల పోరుబాట
- సర్వే డాష్‌బోర్డు నింపకుండా నిరసన
- ఇంటింటి సర్వేలు నిషేధించాలని డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు



ఆకివీడులో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు



రాష్ట్రవ్యాప్తంగా కేవలం 12 సచివాలయాల్లో మాత్రమే సర్వే చేసినట్టు డాష్‌బోర్డులో నమోదైన దృశ్యం

సాక్షి, భీమవరం: మేము బానిసలం కాదు.. ప్రభుత్వ ఉద్యోగులమంటూ సచివాలయ ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఇంటింటి సర్వేలు నిషేధించాలంటూ శుక్రవారం నిర్వహించాల్సిన వాట్సప్ గవర్నెన్స్ ఇంటింట అవగాహన సర్వేను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాలకు గాను కేవలం 12 సచివాలయాల్లో మాత్రమే సర్వే చేసినట్టుగా డాష్‌బోర్డులో అప్‌లోడ్ చేయగా.. జేఏసీ పిలుపు మేరకు మిగిలిన ఉద్యోగులు సర్వేను బహిష్కరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వ్యయప్రయాసలకోర్చి ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన పనిలేకుండా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. రాజకీయ జోక్యం, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల నియామకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండు వేలు, పట్టణ ప్రాంతాల్లో నాలుగు వేల జనాభా ప్రాతిపదికన జిల్లాలో 535 సచివాలయాల పరిధిలో ప్రస్తుతం 4,434 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వీరిలో సచివాలయ సెక్రటరీ, ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, విలేజ్ సర్వేయర్ తదితర ఉద్యోగులు ఉన్నారు. సచివాలయానికి వెళితే చాలు అన్ని పనులు జరిగేలా 500కు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆయా సేవలను బట్టి తక్షణ, కొన్ని 72 గంటలు, మరికొన్ని వారం నుంచి రెండు వారాల వ్యవధిలో పరిష్కరించేలా గడువు పెట్టారు. గత ప్రభుత్వంలో కేవలం దరఖాస్తు చేసుకున్న గంటలోనే రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరుచేసిన సచివాలయాలు ఎన్నో ఉన్నాయి.

కూటమి కుట్రలు

గతంలో నవరత్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరి గడప చెంతకు చేరేలా వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సచివాలయ ఉద్యోగులు పనిచేసేవారు. కాగా సంక్షేమాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయిస్తూ వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. వలంటీర్ల పనులను వారితో చేయిస్తూ మొత్తం పనిభారం ఉద్యోగులపై మోపింది. హౌస్‌హోల్డ్, ఎంఎస్‌ఎం తదితర సర్వేల పేరిట ఇంటింటికి తిప్పుతూ వెట్టిచాకిరీ చేయిస్తోంది. కూటమి వచ్చాక కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సొంత సర్వేలకు సచివాలయ ఉద్యోగులను వినియోగించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. హేతుబద్ధీకరణ పేరిట 3,500 జనాభా పైబడిన సచివాలయాల్లో ఎనిమిది మంది, 2,500 నుంచి 3,500 జనాభా ఉన్న చోట ఏడుగురు, 2,500 లోపు జనాభా ఉన్నచోట ఆరుగురు ఉద్యోగులను కొనసాగించే అంశాన్ని కూటమి తెరపైకి తెచ్చింది. మరోపక్క ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సిఫార్సు లెటర్లకు ప్రాధాన్యమిస్తూ రాజకీయ జోక్యానికి తెరలేపింది. తాజాగా ప్రతి శుక్రవారం వాట్సప్ గవర్నెస్ అవగాహన సర్వేలు నిర్వహించాలంటూ గురువారం సచివాలయ ఉద్యోగులకు మౌఖిక ఆదేశాలందాయి. ఈ విషయమై సచివాలయ ఉద్యోగుల జేఏసీ స్పందించింది. ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వలంటీర్ విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం భీమవరం, ఆకివీడు, జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు వాట్సప్ సర్వీస్ రిజిస్ట్రేషన్లను ఉద్యోగులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. దీంతో జిల్లాలో 535 సచివాలయాల పరిధిలో ఒక్కచోట కూడా వాట్సప్ రిజిస్ట్రేషన్లు జరుగలేదు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

నరసాపురం రూరల్: గంజాయి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.40 వేలు ఖరీదు చేసే 1.938 కిలోల (సుమారు రెండు కిలోలు) గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, రూ.4 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నరసాపురం ఎస్సై సీహెచ్ జయలక్ష్మికి వచ్చిన సమాచారం మేరకు నరసాపురం- పాలకొల్లు రోడ్డులోని వీరభవాని ఆలయం వెనుక గల ఖాళీ స్థలంలో పోలీసులు నిఘా వేశారు. ఉండి ఎన్‌ఆర్‌పీ అగ్రహారంనకు చెందిన కాలుకురస ఏసురాజు నరసాపురం వీవర్స్ కాలనీకి చెందిన పృధ్వీసాయి శివకుమార్, పిచ్చుక ఉదయ్‌కిరణ్ లకు విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు పంపగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఏసురాజు ఏలూరుకు చెందిన మణికంఠ వద్ద గజాయిని కొని నరసాపురానికి చెందిన వ్యక్తులకు విక్రయిస్తున్నాడని, మణికంఠను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. నరసాపురం డీఎస్పీ శ్రీవేద ఆదేశాల మేరకు టౌన్ సీఐ బి యాదగిరి ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడుల్లో ఎస్సై ముత్యాలరావు, హెడ్ కానిస్టేబుళ్లు వేణుగోపాలరావు, ప్రకాష్ బాబు, కానిస్టేబుల్ చక్రవర్తి పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్ : గోదావరి వరద క్రమేపీ తగ్గుతోంది. పోలవరం వద్ద 31.700 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 7.97 లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు చేరుతోంది. దిగువ వరద ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. భద్రాచలం వద్ద 36.80 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పడుతున్నట్టు అధికారులు తెలిపారు.

బీవీ రాజు కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు



జాతీయస్థాయి గుర్తింపు సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరంలోని బీవీరాజు కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ విభాగంలో జాతీయస్థాయి గుర్తింపు దక్కించుకుందని ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు తెలిపారు. కేంద్ర విద్యా శాఖ ఈ నెల 4న విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఈ ఘనత సాధించిందని చెప్పారు. శనివారం రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ కేవీ స్వామి అభినందనలు తెలియజేస్తూ సర్టిఫికెట్ అందించారని వివరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందిని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ ఆర్. రవిచంద్రన్, సెక్రటరీ కె.ఆదిత్య విస్సం, జాయింట్ సెక్రటరీ కె.సాయి సుమంత్, డైరెక్టర్లు తదితరులు అభినందించారు.

వీసీ నియామకానికి ముగ్గురి పేర్లు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ నియామకం కోసం ముగ్గురు సీనియర్ల పేర్లను రిజిస్ట్రార్ ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. ఇన్‌చార్జి వీసీ నియామకానికి అర్హులైన సీనియర్ల పేర్లను వెంటనే పంపాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంటు తరపున ఈ నెల నాలుగున లేఖ పంపిన నేపథ్యంలో జాబితాను పంపినట్టు సమాచారం. మహానందిలోని ఉద్యాన పరిశోధనా స్థానం ప్లాంట్ పథాలజీ విభాగంలో పనిచేసే డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, సీడీహెచ్ ఉద్యాన విభాగం పార్వతీపురంలో పనిచేసే అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్, కేవీకే పెరియవరంలో పనిచేసిన డాక్టర్ బి.గోవిందరాజులు పేర్లు ప్రభుత్వానికి చేరినట్టు తెలిసింది. మరోపక్క 65 ఏళ్ల వయస్సు వచ్చే వరకు యూజీసీ యాక్టును వర్సిటీల ప్రొఫెసర్లకు వర్తింపచేసిన విధంగా తనుక వర్తింప చేయాలని ప్రస్తుత వీసీగా ఉన్న కె.గోపాల్ హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలను ఈ నెల 11న జరుగనున్నాయి.

తాత్కాలికంగా గోదానం, గో దత్తత నిలుపుదల

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో లంపి స్కిన్ వ్యాధి వేగంగా వ్యాపిస్తున్నందు వల్ల భక్తుల నుంచి గోదానాన్ని, అలాగే భక్తులకు ఇచ్చే గోదత్తతను శ్రీవారి దేవస్థానం తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అంటు వ్యాధులు తగ్గిన తరువాత మళ్లీ వీటిని పునః ప్రారంభిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇరగవరం: కె కుముదవల్లిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేశారనే సమాచారం మేరకు వీఆర్వోతో కలిసి శుక్రవారం రాత్రి దాడులు చేసినట్లు సివిల్ సప్లయిస్ ఆర్ఐ కేవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో బందెల సాయి రామ్ అనే వ్యక్తి ఇంటి వద్ద 5 క్వింటాల్ రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని అతడిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉత్తమ లఘు చిత్రం 'చివరి శ్వాస'



హరిరామజోగయ్యను సన్మానిస్తున్న నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో శనివారం నిర్వహించిన నాలుగో అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీల్లో 'చివరి శ్వాస' ఉత్తమ చిత్రంగా నిలిచింది. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రదర్శించిన లఘు చిత్రాలు అందరినీ ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేశాయి. 733, పదిలం.. లఘు చిత్రాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు.. ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్ వైజాగ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాస రాజు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ ముఠా అరెస్ట్

జంగారెడ్డిగూడెం: నకిలీ కరెన్సీ ముఠాను జంగారెడ్డిగూడెం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి సీఐ ఎంవీ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిలీ కరెన్సీతో ప్రజలను మోసం చేస్తున్నారన్న సమాచారం మేరకు డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్, సిబ్బందితో కలిసి స్థానిక బాట గంగానమ్మ ఆలయ సమీపంలో తనిఖీ చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఏలేటి చంద్రశేఖర్ అలియాస్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ కిక్ (గోపాలపురం), లాగు శ్రీను (పేరంపేట), మోతరపు వంశీకుమార్ (నాగులగూడెం)లను అరెస్టు చేసి విచారించామన్నారు. వీరు నకిలీ రూ.500 నోట్లను నల్ల రంగులో ముద్రించి, ఈ నోట్లు ప్రత్యేక ద్రావణంలో ముంచితే అసలైన నోట్లుగా మారుతాయని ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు.

వ్యాన్ బోల్తా.. 15 మంది కూలీలకు గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు జాతీయ రహదారిపై రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో వ్యాన్ బోల్తా పడి 15 మంది కూలీలు గాయాలపాలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా తుని ప్రాంతానికి చెందిన వీరు చేపల వేటకు వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ ప్రాంతానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఏలూరు వచ్చే సరికి వాహనం టైర్ పంక్చర్ కావటంతో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి బోల్తా కొట్టింది. క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 అంబులెన్స్‌ల్లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కావటంతో అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

ఉపకార వేతన పరీక్షకు సిద్ధం

- డిసెంబర్ 7న పరీక్ష
- ఆన్‌లైన్ ద్వారా ఈ నెలాఖరులోగా దరఖాస్తుకు అవకాశం



పెనుమంట్ర మండలం మాముడూరు హైస్కూల్ విద్యార్థులు పరీక్షకు వెళ్లేందుకు సిద్ధమైన దృశ్యం (ఫైల్)

భీమవరం: ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువులో మధ్యలో నిలిపివేయకుండా సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) (ఉపకార వేతనం) అందిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు అంటే 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తారు. దేశవ్యాప్తంగా లక్షమంది విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. ఇందుకుగాను అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఏటా 8వ తరగతి విద్యార్థులకు పరీక్షను నిర్వహిస్తుంది.

పరీక్ష విధానం ఇలా..

డిసెంబర్ 7వ తేదీన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ భాషల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నల విధానంలో 180 మార్కులకు ఉంటుంది. మూడు గంటలు పరీక్షా సమయం. ఈ పరీక్ష పేపర్ రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. మెంటల్ ఎబిలిటీలో 90 మార్కులు, స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో 90 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. అన్ని రెవెన్యూ డివిజనల్ ప్రధాన కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

ఈనెల 10వ తేదీ నుంచి పరీక్ష ఫీజు చెల్లింపు ప్రారంభం. ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 10వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించిన తరువాత విద్యార్థుల దరఖాస్తు, పరీక్ష ఫీజు చెల్లించిన రశీదు పత్రం, కుల, ఆదాయ ధ్రువీకరణ, 8వ తరగతి సర్టిఫికేట్, 7వ తరగతి మార్కుల జాబితా పత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అక్టోబర్ 15వ తేదీలోపు అందజేయాలి. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.100 కాగా ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి.

అర్హులు ఎవరంటే..

ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ 7వ తరగతిలో ఓసీ, బీసీ విద్యార్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులు 50 శాతం మార్కులను సాధించి ఉండాలి. అలాగే ప్రస్తుతం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ప్రభుత్వ ఎయిడెడ్, ఆదర్శ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలలోని 8వ తరగతి విద్యార్థులు మాత్రమే పరీక్ష రాయడానికి అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.3.50 లక్షలలోపు ఉండాలి.

విద్యార్థులకు మంచి అవకాశం



ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేలు చొప్పున ఉపకారవేతం పొందవచ్చు. గత పరీక్ష పేపర్ల అధ్యయనం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ సాగించి మంచి మార్కులతో స్కాలర్‌షిప్ పొందవచ్చు.

– వీరవల్లి వేంకటేశ్వరరావు, ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, స్కూల్ అసిస్టెంట్, మత్స్యపురిపాలెం

దళితులపై దాడులు దారుణం

బాధితులను పరామర్శించిన సంఘాలు, పార్టీల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని బాధితులను పరామర్శిస్తున్న నేతల రమేష్ బాబు

ఏలూరు (టూటౌన్): కైకలూరు మండలంలో దానగూడెంలో దళితులపై జరిగిన దాడులను వివిధ సంఘాలు, పలు పార్టీల నాయకులు ఖండించారు. బాధితులను పరామర్శించి దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ విమర్శించారు. స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై ఆధిపత్య కులాల వారు దాడులకు తెగబడటం సరికాదన్నారు. తమకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. సమావేశంలో గొల్ల కిరణ్, కనికెళ్ల రవి ప్రసాద్, పెరియార్ పాల్గొన్నారు.

తక్షణమే అరెస్టు చేయాలి

దళితులపై హత్యాయత్నం చేసిన దోషులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని దళిత బహుజన్ సీనియర్ నాయకులు నేతల రమేష్ బాబు డిమాండ్‌చేశారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత యువకులను ఆయన పరామర్శించారు. దళితులపై హత్యాయత్నానికి పాల్పడిన జనసేన నాయకులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. కైకలూరులో జరిగిన దాడిని పోలీసులు ఇరువర్గాల ఘర్షణగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

దళిత యువకులపై దాడి చేసి హత్యాయత్నానికి ఒడిగట్టిన బాధితులను శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఏ.ఫ్రాన్సిస్ డిమాండ్‌చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత యువకులను ఆయన శనివారం పరామర్శించారు. గతంలో జనసేన సైనికులు పిఠాపురంలో దళితుల ఊరు మీద పడి దారుణంగా కొట్టారని, ఇప్పుడు కైకలూరులో అలాగే దాడులకు పాల్పడినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏమీ మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

విచారణ జరిపించాలి

కైకలూరు మండలం దానగూడెం దళితులపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి పోలీసు ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దోషులపై అట్రాసిటీ చట్టం పెట్టి అరెస్టు చేయాలని సీపీఎం జిల్లాకార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే హత్యలు, అత్యాచారాలు, దాడులను అరికడతామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నించారు.

గణితం అంటే భయం పోగొట్టి..

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఉస్మాన్ పాషాకు పురస్కారం



లింగపాలెం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ధర్మాజిగూడెం హైస్కూల్ ప్లస్ అధ్యాపకుడు ఉస్మాన్ పాషా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా అవార్డు అందుకున్న ఆయన తన ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. 2008 డీఎస్సీలో ఎంపికై వట్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఆయన 2023 నుంచి పీజీటీ (లెక్కలు) అధ్యాపకునిగా ధర్మాజీగూడెం హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్నట్లు చెప్పారు. వినూత్నమైన టీఎల్ఎం ఉపయోగించి ప్లేవే మెథడ్‌లో బోధించి మంచి ఫలితాలు సాధించానన్నారు. ఐసీటీ ద్వారా టెక్నాలజీని ఉపయోగించి పీపీటీఎస్ యానిమేటెడ్ వీడియోలు తయారు చేయడం, జియోజీబ్రా, రోటో కంపాస్ లాంటి యాప్స్ ఉపయోగించి బోధించడం ద్వారా విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని పోగొట్టడంతో దాదాపు పది మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు, ప్రతిభ అవార్డులు సాధించారన్నారు. 2019లో సాంకేతిక శిక్షణ నేస్తం సీబీటీ పోటీ పరీక్షల్లో స్టేట్ రెండవ ర్యాంకు సాధించి ఏపీ ఎస్సీఈఆర్‌టీ టెక్స్ బుక్స్ ఆథర్‌గా సెలెక్ట్ అయ్యి గణిత పుస్తక రచనలో సేవలు అందించినట్లు వివరించారు.

క్లుప్తంగా

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): డ్రగ్స్, సిగరెట్టు, మద్యానికి యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సైకాలజిస్ట్ టి.గంగాధర్ పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ బేస్డ్ పీర్‌లెడ్ ఇంటర్వెన్షన్ (సీపీఎల్ఐ) అవగాహన సదస్సు జరిగింది. గంగాధర్ మాట్లాడుతూ డ్రగ్స్ అంటే ఏమిటి? అవి ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపిస్తాయి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, సిగరెట్టు, మద్యాలను ఎవరైన తీసుకోవాలని ఒత్తిడి చేస్తే తిరస్కరించాలని సూచించారు. వ్యసనాలు తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇస్తాయని చెప్పారు. మత్తు మందులు లేకుండా ఆనందం పొందే మార్గాలను తెలిపారు. చదువు యోగా, ఆట లు, పాటలు, నృత్యాలు ఎంతో ఆనందాన్ని, సంతోషాన్ని ఇస్తాయనిచెప్పారు. హాస్య యోగా చేయించారు. హెచ్‌ఎం ధనలక్ష్మి, సీపీఎల్ఐ సిబ్బంది కృష్ణవేణి, వెంకటేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణలో మాట్లాడుతున్న వైద్యులు

తణుకు అర్బన్: క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండి చిన్నపాటి లక్షణాలు కనిపించినా వెంటనే స్క్రీనింగ్ చేయించుకోవాలని వైద్యులు కోరారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోఎన్‌సీడీసీడీ 4.0 సర్వేలో భాగంగా శనివారం క్యాన్సర్ స్క్రీనింగ్ పై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్‌లపై డెంటల్ వైద్యులు డాక్టర్ కమల్ షా, గైనకాలజిస్ట్ డాక్టర్ లెటోర్నదేవి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేఎంఆర్ కిషోర్, పీఓయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీలక్ష్మి, జిల్లా ఎపిడెమోలాజిస్ట్ గాతల సుభాష్, డాక్టర్ మౌనిక, డాక్టర్ భారతి, పీహెచ్‌సీల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై ఏడు ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా జయకుమారి



పెంటపాడు: మండలంలోని జట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ సహాయకురాలిగా పనిచేస్తున్న జి.జయకుమారికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఈ అవార్డును శుక్రవారం అందుకున్నారు. కాగా శనివారం ఆమెను పలువురు ఉపాధ్యాయులతో పాటు ఎంఈవోలు శ్రీనివాస్, టీవీఆర్కేలు ప్రత్యేకంగా అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా 120వ వార్షికోత్సవం



తణుకు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కేకు కట్ చేస్తున్న బ్రాంచ్ మేనేజరు వినోద్‌కుమార్

తణుకు అర్బన్: ఖాతాదారుల విశ్వాసమే మా శక్తి – వారి అభివృద్ధే మా లక్ష్యం అనే ధ్యేయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు సత్వర, మెరుగైన సేవలు అందిస్తుందని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. తణుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో శనివారం 120వ స్థాపన దినోత్సవాన్ని తణుకు శాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, ప్రముఖులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో మెరిసి.. అవార్డుతో మురిసి

- మండపాక హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు
- అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్, కబడ్డీ, మోడరన్ పెంటాతలాన్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు
- పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటుకు ధీటుగా క్రీడల్లో శిక్షణ



మండపాక జిల్లా పరిషత్ హైస్కూలు



కలెక్టర్ నుంచి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న పాఠశాల హెచ్‌ఎం ఫణిశ్రీ, పీడీ సూర్యనారాయణ

తణుకు అర్బన్: తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ హైస్కూల్ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డును అందుకుంది. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మండపాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.ఫణిశ్రీ, ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ ఈ అవార్డును అందుకున్నారు. జిల్లాలో 250కిపైగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా తణుకు నియోజకవర్గంలోని చిన్న గ్రామంలో ఉన్న పాఠశాలకు ఈ అవార్డు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో విద్యార్థులు ఉండి పెద్ద ఎత్తున క్రీడా ప్రాంగణాలు ఉన్న పాఠశాలలకు రాని అవార్డులు కేవలం 130 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల అవార్డును అందుకోవడం పాఠశాలపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో మూడవ పాఠశాలగా..

స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డులో భాగంగా జిల్లాలో 5 పాఠశాలలు ప్రకటించగా మండపాక జిల్లా పరిషత్ హైస్కూల్ మూడవ స్థానంలో నిలవడం విశేషం. మొదటి స్థానంలో శృంగవృక్షం జిల్లా పరిషత్ హైస్కూల్, రెండోస్థానం భీమవరం మునిసిపల్ హైస్కూల్, నాలుగోస్థానంలో గొరగనమూడి జిల్లా పరిషత్ హైస్కూల్, తోలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లు నిలిచి అవార్డులు అందుకున్నాయి. మండపాక పాఠశాలలో అన్ని రకాల క్రీడల్లోను విద్యార్థులు సత్తాచాటుతుండగా ముఖ్యంగా అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్, కబడ్డీ, మోడరన్ పెంటాతలాన్ పోటీల్లో క్రీడాకారులు సత్తాచాటారు.

నాడు– నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి క్రీడాపరికరాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాఠశాలల్లో క్రీడలపట్ల విద్యార్థులకు ఆసక్తి పెరిగింది. ఆడుదాం ఆంధ్ర తదితర క్రీడా ప్రోత్సాహాలతో విద్యార్థులు క్రీడల పట్ల వ్యామోహం పెంచుకున్నారు. దీనికి తోడు వ్యాయామ ఉపాధ్యాయుల అత్యున్నత కృషి కారణంగా క్రీడాంశాల పట్ల విద్యార్థుల్లోను చైతన్యం వచ్చింది. పాఠశాలల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని కఠోర శ్రమతో విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎగబాకారు. రాష్ట్రస్థాయిలో వివిధ పోటీల్లో 25 మంది విద్యార్థులు ఎంపికకాగా, జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్, త్రోబాల్, ఫెన్సింగ్ పోటీల్లో 60కిపైగా బహుమతులు గెలుచుకున్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన మండపాక హైస్కూల్ క్రీడాకారులు

- 2021లో సామర్లకోటలో జరిగిన రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో ఆర్ రుచిత అత్యుత్తమ ప్రతిభతో 4వ స్థానంలో నిలిచింది.
- 2022లో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో వై.నీతూచంద్రిక సత్తాచాటింది.
- 2023లో నంద్యాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో పి.సిద్దు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.
- 2023లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్లలో పి.సిద్ధు, 1500 మీటర్లలో కె.పోసియ్య పాల్గొని సత్తాచాటారు.
- 2024లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎ.కృష్ణ సత్తాచాటాడు.
- 2024లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో ఎస్.గణేష్ సత్తాచాడాడు.
- 2024 నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మండపాక హైస్కూలు విద్యార్థులు కె.చరణ్, ఆర్.యల్లపరాజు, ఎ.శ్యామ్‌సుందర్, బి.భార్గవరామ్, ఎస్.నాగగణేష్, ఆర్. తరుణ్, కె.అభిషేక్‌లు పాల్గొన్నారు.
- 2024లో శ్రీకాకుళంలోజరిగిన రాష్ట్రస్థాయి మోడరన్ పెంటతలాన్ పోటీల్లో విద్యార్థులు బి.భార్గవ్‌రామ్, ఎస్.గణేష్, పి.తేజరత్నం సత్తాచాటారు.
- 2024 నంద్యాలలో జరిగిన ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో శ్రవణ్, కె.తరుణ్, ఎస్.లలితారాజేశ్వరి, కె.జానకి పాల్గొన్నారు.
- 2025 అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌లో కె.నాని జిల్లాజట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.
- 2025 చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు ఎం.నాగలక్ష్మి, బి.దివ్య, పి.తేజరత్నం పాల్గొన్నారు.

పీడీ కృషితో మంచి ఫలితాలు



విద్యతోపాటు క్రీడలకు పాధాన్యతనిస్తూ క్రీడల్లో మంచి ఫలితాలు రాబట్టగలిగాము. పాఠశాలలో ఉన్నటువంటి తక్కువ వసతులతోనే మా ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ కృషితో విద్యార్థులు క్రీడల్లో అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఆ ఫలితమే మా పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు దక్కింది.

– కె.ఫణిశ్రీ, మండపాక జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు

స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు సంతృప్తినిచ్చింది



మండపాక జిల్లా పరిషత్ హైస్కూలుకు నేను 2019లో బదిలీల్లో వచ్చాను. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేశాను. ఉదయం 6 గంటల నుంచి విద్యార్థులను క్రీడల్లో పాల్గొనేలా చేశాను. స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– సంకు సూర్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్, మండపాక జిల్లా పరిషత్ హైస్కూల్

రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్‌లో పాల్గొన్నాను



మా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్‌లు క్రీడలపట్ల మాకు అందించిన ప్రోత్సాహం ఎంతో ఉంది. దీంతో విద్యార్థులంతా క్రీడలవైపు ఆసక్తి చూపించారు. ఈ ఏడాది ఆగస్టులో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో పాల్గొని మంచి ఫలితాన్ని సాధించాను.

– బి.దివ్యశ్రీలక్ష్మి, 9వ తరగతి విద్యార్థిని

స్విమ్మింగ్‌లో రాటుదేలాను



మా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఇచ్చిన సూచనలతో స్విమ్మింగ్ పోటీలకు ప్రత్యేక శిక్షణ పొందాను. నాలో పోటీతత్వం పెంచేందుకు మా పీడీ ఎంతో కృషిచేసి నన్ను తీర్చిదిద్దారు. దీంతో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశాలను అందిపుచ్చుకున్నాను.

– ఎ.శ్యామ్‌సుందర్, 10వ తరగతి విద్యార్థి

అమెరికా టారిఫ్ పెంపును వ్యతిరేకించాలి



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమెరికా టారిఫ్ పెంపును వ్యతిరేకించాలని, తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని, ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరం పడిపోయాయని తెలిపారు. రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని దెబ్బ తీస్తున్న కేంద్రంలోని మోదీ సర్కార్, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నించకపోవడం హాస్యాస్పదమని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని, నిరసనలు తెలిజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేసుబాబు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

అమెరికా టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రజలకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. నాయకులు మామిడి దాన వర ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఉదయ రాజు, ప్రసాద్ కుమార్, అశ్విన్, విజయ్ రాంబాబు, నాగేశ్వరరావు, రామారావు, కృష్ణ, వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

తణుకులో చెత్తతోనే సావాసం



పొట్టి శ్రీరాములు వీధిలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త పక్కనుంచి ప్రయాణిస్తున్న ప్రజానీకం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలో చెత్తతో సావాసం చేయాల్సిన దుస్థితిలో ప్రజానీకం అల్లాడుతున్నారు. ఆంధ్రకేసరి పొట్టి శ్రీరాములు వీధిలో భారీ చెత్తకుప్ప కొన్ని రోజులుగా ఉన్నప్పటికీ శానిటరీ అధికారులు పట్టించుకోవడంలేదని నివాసితులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇదే వీధిలో రెండు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లు ఉండడంతో నిత్యం ప్రజలు నడకదారిన అధికసంఖ్యలో ప్రయాణాలు చేస్తుంటారు. వారంతా ఈ చెత్తకుప్పకు సమీపంలోనే ప్రయాణాలు చేయాల్సి రావడంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో పేరుకున్న చెత్తకుప్పను శానిటరీ అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తతోపాటు ఎండిన కొమ్మలు ఉండడంతో అగ్నిప్రమాదం సంభవించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు చెలరేగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే శానిటరీ అధికారులు స్పందించి చెత్తకుప్పను తొలగింపజేయాలని కోరుతున్నారు.

పోషకాహారంతోనే శారీరక ఆరోగ్యం



లింగ వివక్ష – బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: పోషకాహారంతోనే శారీరక ఆరోగ్యం కలుగుతుందని ఏఎన్‌ఎం విజయశాంతి అన్నారు. శనివారం మండలంలోని ఆరుగొలను స్కూల్‌లో హెల్త్, న్యూట్రీషన్, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా శారీరక రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, ఎస్‌కే.కాజా బీ, ఎ.ముత్యాలు, పి.సునీత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే, వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగ వివక్ష – బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఈవో కిషోర్ మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండాకా వివాహాలు చేయాలన్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా తమ పిల్లల్ని పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. హెచ్‌ఎం డి.సుకుమార్, ఉపాధ్యాయులు ఎం.పద్మావతి, ఎం. సుజాత, ఎం.చందు, బి.జ్యోతి, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. కొమ్ముగూడెంలో జరిగిన కార్యక్రమంలో టీ.రాణి, ఎం.వెంకటరమణ, ఇ.మంగతాయారు, యు.వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మంచిలిలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

అత్తిలి: పనిచేసే చోట మహిళలను వేధింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎం శ్రీలక్ష్మి అన్నారు. అత్తిలి మండలం మంచిలి గ్రామంలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికలతో పనిచేయించుకుంటే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మంపాడులో...

గుమ్మంపాడు గ్రామ సచివాలయంలో జరిగిన మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే రాగసుధ, హెచ్‌వీ జీ అమ్మాజీ, బి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీచేసారు. పోషణ వాటికలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ శ్రీదేవి అందజేశారు.

అన్నసమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి ఉపాలయమైన శ్రీ అశ్వత్థ గణపతి నవరాత్రులలో భాగంగా శనివారం అన్నప్రసాద సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా అన్నసంతర్పణ ప్రారంభించారు.

కారుమూరి పరామర్శలు



మంచిలిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: మండలంలో మంచిలి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. మంచిలి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు చింతపల్లి సత్యనారాయణ, కాసగిరి మల్లిఖార్జునరావు, నల్లమిల్లి శంకర్‌రెడ్డి, జక్కంపూడి అబ్బులు, మాజీ ఎంపీటీసీ కేతా చిన్నారావు, వెలగల జగ్గిరెడ్డి, ఎజర్ల రామరాజు, మాజీ వైస్ ఎంపీపీ దారం శిరీష, మురాల పుష్ప, మల్లుల ఆనంద్, బొంతా ఇమ్మానియేలు తదితర కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కారుమూరి శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు చిన్నరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్యాంబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, పీవీఎస్, చిన్నబాబు, లక్ష్మీపతి, శ్రీనివాసరెడ్డి, సురేష్‌రెడ్డి, నరశింహమూర్తి, రాంపండు, ధనరాజ్, కిశోర్, ఇశ్రాయేలు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



తణుకులో ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

తణుకు అర్బన్: విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్, తణుకు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పేర్కొన్నారు. తణుకులో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయులుగా సేవలు అందించిన నిరీక్షణ రాజు దంపతులతో పాటు పాస్టర్, అధ్యాపకులు కె..రాజేష్, కె.నిర్మల్ కుమార్, ఓ.మిన్నీ రోజు, బి ఉషాదీప్తిలను ఘనంగా సత్కరించి వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఓ.మనోజ్, కె.బ్లెస్సింగ్ రాజు, కేఎస్ రాజు, కె.డేవిడ్ బాబు, జి.జాయ్, ఎస్.కృపావరం, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ అవార్డులకు వాసవీ ఉపాధ్యాయులు



జేఎన్‌టీయూ అవార్డును అందుకుంటున్న వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం: జేఎన్‌టీయూ కాకినాడ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఈ గుర్తింపు కలిగిన విద్యాలయాల టాప్ 2 శాతం సైంటిస్టుకు గాను ఇచ్చే అవార్డు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యాయునికి లభించినట్టు పాలకవర్గ అధ్యక్ష, కార్య దర్శులు శనివారం తెలిపారు. పరిశోధనఅంశాల్లో అధిక ప్రచురణలు, హై ఇండెక్స్ స్కోపస్ సైటేషన్స్ హోల్డర్ అవార్డులను వాసవీ అధ్యాపకులు డాక్టర్ సూరపరాజు సుబ్బరాయ కౌశిక్ ఎంపికయ్యారు. శనివారం జేఎన్‌టీయు వీసీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.


ఘనంగా గణనాథుడి నిమజ్జనాల సందడి



గూడెంలో ఊరేగిస్తున్న గణనాథుడు



పాతూరు వినాయక విగ్రహం ఊరేగింపు



కడియద్ద గ్రామంలోని గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం



తణుకులో ప్రత్యేక వాహనంపై నిమజ్జనానికి వెళ్తున్న వరసిద్ధి వినాయకస్వామి



తణుకులో వేంకటేశ్వరస్వామి వేషధారణలో కళాకారుడి నృత్యం



తణుకు రాష్ట్రపతి రోడ్డులో శక్తివేషాల సందడి

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకులో గణనాథుడి విగ్రహాలను నిమజ్జనాలను భారీ ఊరేగింపులతో తీసుకువెళ్లారు. విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాల్లో వేంచేసియున్న గణనాథుడి ప్రతిమలను ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనాలు చేశారు. తణుకు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మహోత్సవాల్లో భాగంగా పూజలందుకున్న గణనాథుడిని మేళ తాళాలతో ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామిని ఆశీనులను చేసి బ్యాండు మేళాలు, శక్తి వేషాలు, విచిత్ర వేషధారణలు, బుట్ట బొమ్మలు, దేవతామూర్తుల వేషధారణలను ధరించిన కళాకారులతో తణుకు ప్రధాన వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కొమ్మిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. స్వామివారి ఊరేగింపును తిలకించేందుకు ప్రధాన రహదారుల పైకి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 11వ రోజు శనివారం సాయంత్రం వివిధ వార్డులలో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలు వద్ద నుంచి అత్యంత వైభవంగా వినాయక నిమజ్జనోత్సవాలు జరిగాయి. తీన్‌మార్ డప్పులతో, బాణ సంచాలు సౌండ్స్‌తో ఫ్లెడ్ లైట్స్ కాంతులతో ఊరేగింపు ఘనంగా జరిగాయి. యువత, పిల్లలు డ్యాన్స్‌లతో హోరెత్తించారు. దారిపొడవున భక్తులు స్వామివారికి పూజలు జరిపారు. రాత్రి సమయంలో స్థానిక ఏలూరు కాలువలో వద్ద స్వామివారిని నిమజ్జనం చేశారు. తొలుత లడ్డు వేలంపాటు జరిగాయి. పలు ప్రాంతాలలో అన్నసమారాధనలు జరిగాయి.

కడియద్దలో గణనాథుని ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని కడియద్ద గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం గణనాథుడిని ఊరేగించారు. 20 అడుగుల గణనాథుడిని ప్రత్యేక అలంకరించిన వాహనంలో ఉంచి వాయిద్యాల నడుమ ఊరేగించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన పరిమి బ్రహ్మానంద చౌదరి, పరిమి భాస్కర రావు కుటుంబాలు వేలం పాటలో కైవసం చేసుకున్నారు. ఉత్సవ పందిళ్ల కమిటీలన్నీ ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.